# పత్రికల చిత్రిక

ఆరోజు రాత్రి భోజనం చేయబోతుండగా వచ్చింది ఫోన్ కాల్. మూర్తిగారి దగ్గర నించీ. నేను ఇండియాలో పని చేసేటప్పుడు ఆయన నా కొలీగ్. కోలరాడోలో వాళ్ళమ్మాయి దగ్గరికి వచ్చాడుట. వచ్చి నాలుగు నెలలయిందనీ ఇంకో పది రోజుల్లో ఇండియాకి తిరిగి వెళ్ళిపోతున్నాననీ, డల్లాస్‌లో మేనల్లుడిని చూడటానికి వస్తున్నాననీ శనాదివారాలు ఆస్టిన్‌లో మా ఇంటికి వస్తాననీ సారాంశం. ఆయన్ని చూసీ, వినీ చాల సంవత్సరాలయిందేమో నాకెంతో సంతోషంవేసింది. ఆ వారాంతం మేమూ ఖాళీగా వున్నాం కనుక అంతకన్నా ఆనందం లేదనీ రమ్మనమనీ ఆహ్వానించాం.

శుక్రవారం రాత్రి ఆయన మేనల్లుడు సురేష్ డల్లాస్‌నించీ ఫోన్ చేశాడు. మా ఇంటికి ఎలా రావాలో చెప్పాను. మూర్తిగారు రచయిత కాదు కానీ తెలుగు పుస్తకాలు తెగ చదివేవాడు. జర్నలిజం మీదా, సాహిత్యం మీదా మేమిద్దరం చాల చర్చలు చేస్తుండేవాళ్ళం.

ప్రొద్దున్న పదకొండు గంటలయిందేమో వాళ్ళు వచ్చేసరికి. షేక్ హేండ్ ఇస్తూ నా చేయి పట్టుకుని పది నిముషాలదాకా వదల్లేదాయన. చాలసేపు మా పాత రోజుల జ్ఞాపకాలను నెమరేసుకుంటూ కూర్చున్నాం. సురేష్‌కి బోరు కొట్టిందో ఏమో పక్కనే వున్న న్యూస్ పేపర్ మొదటి పేజీనించీ చివరిదాకా చదివేశాడు.

ఆయన ఆస్టిన్ స్టేట్స్‌మన్ పేపర్ చేతిలోకి తీసుకుని, 'ఏమిటయ్యా మీ అమెరికన్ పేపర్లు, మీ టీవీ వార్తలూ. అసలది జర్నలిజమేనా?' అని అడిగాడు.

ఆయన మాటలకి నాకు నిజంగానే ఆశ్చర్యం వేసింది. 'అదేమిటి?' అన్నాను.

'ఎంతసేపటికీ మీ అమెరికన్ వార్తలూ, లేకపోతే ఇరాక్ యుద్ధమూనూ. ఎక్కడా ఇండియా గురించి వార్తలు చెప్పరేం?' అన్నాడు.

నేను జవాబు చెప్పేలోపలే సురేష్ 'అమెరికాలో అమెరికన్స్ కోసం వచ్చే వార్తలు మరి అమెరికా గురించే కదా వుండేది!' అన్నాడు నవ్వుతూ.

'నీ మొఖం. ఇండియాలో ఇండియన్స్‌కోసం చెప్పే వార్తల్లో మరి అమెరికా గురించి ఎక్కువగా చెప్పటంలేదూ'

సురేష్ అన్నాడు, 'అవును మరి. ప్రతిరోజూ కొన్ని వందలమంది ఇండియా నించి అమెరికా వలస వస్తుంటే ఇక్కడి వార్తలు అక్కడ అవసరమే కదా. వీళ్ళకి ప్రపంచంలోవున్న మూడొందల యాభై పైచిలుకు దేశాల్లో ఇండియా ఒకటి. అందులోనూ ఇంగ్లండ్ జపాన్ చైనా సింగపూర్ పాకిస్థాన్లలా అంత మిత్రదేశం కూడా కాదు. అయినా మరీ ముఖ్యమైన వార్తలు... ఇదిగో బెంగుళూర్ ఔట్‌సోర్సింగ్ మీద ఒక ఆర్టికిల్ వుంది చూడు' అని బిజినెస్ సెక్షన్ అందించాడు సురేష్.

'ఉందిలేవోయ్. ఔట్‌సోర్సింగ్ వాళ్ళకి అవసరం కనుక దాని గురించి వ్రాసుకున్నారు' అన్నాడు.

సురేష్ మళ్ళీ నవ్వి అన్నాడు, 'అవును. వాళ్ళకి కావలసినవే కదా వ్రాసుకునేది. న్యూస్ పేపర్లు, టీవీ ఇక్కడి ప్రజలకి కావలసినవే ఇస్తారు. ఎంతమంది అమెరికన్లకి మనదేశ వార్తల మీద ఉత్సాహం వుంటుంది? మన దేశచరిత్ర మీదో, మన మతం మీదో, తాజ్‌మహల్ హిమాలయాలు మొదలైన విషయాల మీదో అయితే ఇక్కడ హిస్టరీ ఛానల్ లోనో, ట్రావెల్ ఛానెల్‌లోనో వస్తూనే వుంటాయి...'

అతని జవాబు ఆయనకి నచ్చినట్టు లేదు. సంభాషణని కొంచెం పక్కదారి పట్టించటం అవసరమనిపించింది నాకు. అందుకే ఒకసారి చిన్నగా నవ్వి అన్నాను - 'అమెరికన్ టీవీలో ఇండియా వార్తలు అనేది జర్నలిజానికి సంబంధించినది కాదు. ఇక్కడ జర్నలిజం గురించి మాట్లాడుకుందాం. నేను ఇండియాలో వున్నప్పుడూ ఇక్కడా ఎంతో నిశితంగా పరిశీలించే విషయం అది. మీకూ తెలుసు మనిద్దరం ఆ విషయం గురించి అక్కడ ఎన్నో చర్చలు చేసుకునే వాళ్ళం. గుర్తుందా. చంద్రమండలం మీద మనిషి అడుగు పెట్టిన రోజు, ఒక ఇజానికి కట్టుబడిన విజయవాడ తెలుగు వార్తా పత్రిక, ఆ వార్త వెనక్కి తోసి గుంటూరులో పుగాకు వర్తకుల సమ్మె అని మకుటం పెట్టింది. అంతేకాదు. నా కథలు అడిగి ప్రచురించే కొన్ని పత్రికలు, నేను ఒక ప్రముఖ దొంగ సన్యాసి గురించి నిజంగా జరిగిన కథ ఒకటి వ్రాస్తే, ఆ పత్రికలేవీ ఆ కథ ప్రచురించలేదు. ఒకదాని తర్వాత ఒకటి నా కథలని ఇష్టంగా ప్రచురించే పత్రికలన్నిటికీ పంపించాను. కథ తిరిగి వచ్చింది. చివరికి ఆంధ్రభూమిలో ఆనాటి సంపాదకుడు ప్రచురించాడు. ఇలాటి విషయాల మీద మనం మాట్లాడుకునేవాళ్ళం కదూ..'

ఆయన నా మాటలకి మళ్ళీ ఫ్లాష్ బాక్‌లోకి వెళ్ళిపోయాడు. రెట్టింపు ఉత్సాహంతో అన్నాడు. 'అవును. మనిద్దరికీ ఇష్టమైన విషయం అది. ఒక ఇంగ్లీష్ వార్తాపత్రికలో అన్నీ గోడమీద పిల్లివాటం సంపాదకీయాలు వుండేవి. నొప్పింపక తానొవ్వక వ్రాశేవాళ్ళు అవన్నీ. అలాగే నిజాల కన్నా ఇజాలకి ప్రాముఖ్యం ఇచ్చే పత్రికలు కూడా వుండేవి. ఇంకా వున్నాయి లెండి. కొన్ని పత్రికలయితే ముఖ్యమంత్రుల చేతుల్లో వున్నాయి. వాళ్ళ తుమ్మినా తుమ్మకపోయినా తెలుగు తుమ్ము అనే మకుటంతో మంచి వార్తే. అలాగే వారి పార్టీని వ్యతిరేకించే పార్టీ నాయకులు తుమ్మితే దేశానికి అనారోగ్యం. తుమ్మకపోతే అరిష్టం. అదీకాక ఎల్లో జర్నలిజం. ఒక హీరోకీ ఒక హీరొయిన్‌కీ సంబంధం అంటగట్టి రాస్తే అదో పెద్ద వార్త...'

'అవును. బుద్ధిమంతుడు సినిమా తీస్తున్నప్పుడు బాపుకీ, నాగేశ్వరావుకీ ఒకళ్ళ మీద ఒకళ్ళకి కోపం వచ్చి ఒకళ్ళ జుట్టు ఇంకొకళ్ళు పట్టుకుని కొట్టుకున్నారు అని వ్రాసిందిట ఇలాటి ఒక పత్రిక. అది చూసి బాపుగారన్నారుట 'నాగేశ్వరావు జుట్టూ నా జుట్టూ చూసినవాళ్ళకి తెలుస్తుంది ఆ వార్తలో ఎంత నిజం వుందో అని'

సురేష్ పెద్దగా నవ్వాడు 'బాగుంది. ఇక్కడకూడా ఈ ఎల్లో జర్నలిజం వుంది. అమెరికా కన్నా కూడా ఇంగ్లాండ్‌లో ఇది ఎక్కువ. బ్రిటిష్‌వాళ్ళు రోజూ ప్రొద్దున్నే బ్రేక్‌ఫాస్ట్‌లో కోడిగుడ్డులోని ఎల్లోని (పసుపు భాగం) తినేటప్పుడు ఇవే చదువుతారుట. అందుకనే వచ్చిందేమో ఎల్లో జర్నలిజమని' అన్నాడు జోక్ చేస్తూ.

ఆరోజు మూర్తిగారికి టీవీలో మూడు షోలు చూపించాను. ఒకటి జే లెనో అనే అతను తన షోలో రాజకీయ నాయకులు చేసిన ఉపన్యాసాల్లోని మాటల్ని పట్టుకుని వాళ్ళని ఆట పట్టించటం. అమెరికా ప్రెసిడెంట్ చెప్పిన మాటలు ఎంత హాస్యాస్పదంగా వున్నాయో చెప్పి అందర్నీ నవ్విస్తున్నాడు. అచ్చం ప్రెసిడెంట్ లాగానే వున్న ఒకతన్ని తీసుకువచ్చి అతని మీద జోకులు వేస్తున్నారు. అది చూసి మూర్తి గారు ముక్కు మీద వేలు వేసుకున్నారు. 'దేశం ప్రెసిడెంట్ మీదే ఇలా జోకులు వేస్తే వూరుకుంటారా?' అన్నాడు. 'ఎందుకు వూరుకోరు. ఆయన చెప్పిన విషయం మీదే కదా జోకులు... ' అన్నాడు సురేష్.

రెండవ షోలో ఒక సెనెటర్ని (మన పార్లమెంట్ మెంబర్‌లాటి వాడు) ఏనాడో చేసిన ఒక తప్పుని బయట పెట్టి ఉతుకుతున్నారు. ఆయన చెప్పే జవాబులు ఎవరికీ రుచించటంలేదు. టీవీలో ప్రత్యక్షంగా ఉతికి ఆరేశారు. మూర్తిగారికి మళ్ళీ ఆశ్చర్యం వేసిందేమో ఈసారి ముక్కు మీద రెండు వేళ్ళు వేసుకున్నారు. 'మన పత్రికల్లో టీవీలోకూడా ఇలా ఉతికితే ఎంత బాగుండును' అనుకుంటున్నట్టున్నాడు.

మూడవది సీస్పాన్ అనే గవర్నమెంట్ ఛానల్. దాంట్లో ఏదో విషయం మీద వాషింగ్టన్‌లో ఓటింగ్ జరుగుతున్నది. ఎన్నికయిన రిప్రజెంటేటివ్‌లు అందరూ ఓట్లు వేస్తున్నారు. ఎవరెవరు ఓట్లు ఎలా వేస్తున్నారో, ఆ విషయం మీద ఎంతమంది సుముఖులో ఎంతమంది కాదో, ఓటింగ్ పూర్తవటానికి ఇంకా ఎంత టైం వుందో టీవీలో వస్తున్నది.

'అదేమిటి. ఇక్కడ సీక్రెట్ ఓటింగ్ కాదా?' అని అడిగాడు మూర్తిగారు.

'సీక్రెట్ ఎందుకూ. ప్రజల మంచి గురించి దేశంలో జరిగే విషయాలకి తాము ఎన్నుకున్నవారు ఎలా ఓటు వేస్తున్నారో తెలుసుకునే హక్కు మరి ప్రజలకు లేదూ. తర్వాత ఎన్నికల్లో ఓటు వేసేటప్పుడు, ప్రతి రిప్రజెన్‌టేటివ్ చరిత్రా బయటికి వస్తుంది. ఏమేం చేస్తానని ఎన్నికలలో గెలిచాడో, వాటిల్లో ఎన్నిటికి కట్టుబడి ఎలా ఓట్లు వేశాడో సులభంగా తెలిసిపోతుంది. లైవ్ ఆన్ టీవీ' అన్నాను.

'మనం ఇంకా ఈస్థాయికి రాలేదు. ఏరోడ్డు పక్కనో రాజకీయ నాయకుల అవినీతి గురించీ ఉద్యోగుల లంచాల గురించీ మాట్లాడుకోవాలే కానీ పత్రికలలోనూ టీవీలలోను ఇంకా ఆ స్వాతంత్రం రాలేదు. అక్కడా ఇక్కడా కొంత జరుగుతున్నా, ఇంకా ఎంతో ముందుకు పోవాల్సివుంది. కొంతమంది పత్రికా సంపాదకులకు పాఠకులలోనో ప్రభుత్వంలోనో ఎవరికైనా నచ్చనివి ప్రచురించే ధైర్యం లేదు. ఒకవేళ అలా ప్రచురించినా రకరకాలుగా వాటి ఫలితాలని ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఎవరన్నారో గుర్తు లేదు కానీ, పత్రికా స్వాతంత్రం వచ్చిననాడే దేశానికి నిజంగా స్వాతంత్రం వచ్చినట్టు అని' అన్నాడు మూర్తిగారు.

అవును. ఆయన చెప్పింది నిజంగా నిజం. పత్రికలు నిజాలని నిజాయితీతో చిత్రించటమేకాదు, అన్యాయాలనీ రాజకీయ దుర్గంధాన్నీ చిత్రిక కూడా పట్టాలి. అప్పుడే డెమోక్రసీ అనే దానికి అర్థం.

0 0 0